ఆమె ఆఖరి ప్రదర్శనం*

‘ అక్కన్న ’

ఆమధ్య ఎప్పుడో ఒకరోజున టెలిఫోనుగైడులో ఏదో నంబరుకోసం వెతికినపుడు అనుమానం వేసింది. అక్షరాలు, అంకెలు, అలుక్కుపోయినట్లు అవుపడ్డాయి. ఏమిటా అని అనిపించింది. కాస్త భయమేసింది. కాని అంతట్లోనే పరవాలేదనుకుంది. భర్తతోకూడా చెప్పలేదు.

రానురాను వస్తువులన్నీ ఇపుడు, అదోమోస్తరుగా అస్పష్టంగా కనుపడటం మొదలుపెట్టాయి. మొన్న తను కట్టుకున్న చీరెమీద పువ్వులు, పువ్వులుగా కనబడలేదు. ఏవో మచ్చలు, మచ్చలుగా కనుపడినాయి. గుండె జల్లుమన్నది. కడుపులో షాకు ఇచ్చినట్లయింది. అవాళకూడా భర్తకిచెప్పలేదు.

కళ్లజోడు వేసుకుంటే సరిపోతుంది. కళ్లజోడు వేసుకోటంమూలాన తన అందం చెడిపోతుందని భయం లేదు. సినీతారలనేకమంది తాటికాయలంత నల్లఅద్దాలను వేసుకొని తిరుగుతున్నారు. ఇపుడు అది ఒకఫ్యాషనుగాకూడా ఉంది. తనకయితే అనల్లద్దాలంటే ఇష్టం లేదు. కాని అద్దాలువేసుకోటం తప్పదు. మనస్సును సరిపెట్టుకోక తప్పదు. నాటకాలలో వేషాలువేయటం తనవృత్తి. పైగా డ్యాన్సు చేస్తూఉంటుంది. తన భర్త తమనాటకసమాజానికి డైరెక్టరు, ప్రొప్రైటరు. స్టేజిమీదకి కళ్లజోడు పెట్టుకుని ఎలావెళతాం! డాక్టరు గణపతి కంటిలోనే గుడ్డుపైన అమరిపోయే అద్దాలను పెడుతాడట. ఇది అమెరికాలో నేర్చుకొని ఈ మధ్యనే వచ్చాడట. ఏరంగు కళ్లుకావాలంటే ఆ రంగు కళ్లుగా కనపడేలాగా అద్దాలు పెట్టువచ్చునట కూడా. తను ఇంకా అందంగా కనపడవచ్చు. తనవృత్తికీ భంగం రాదు. తనేమైనా టైపుచేయాలా? ప్రూఫులు దిద్దాలా? భయంలేదు, అన్నీ మామూలుగానే గడచిపోతాయి. ఇలా అనుకొని గౌరీబాల అవాళే డాక్టరు గణపతికి టెలిఫోను చేసింది. రేపు ఊళ్లోఉండను ఎల్లుండి రమ్మన్నాడు.

గౌరీబాల భర్తపేరు పార్థసారథి. అతనికి చిన్నప్పటినుంచి నాటకాలంటే ఎక్కడ లేని పిచ్చి. చదువు పూర్తయి కాస్త పెద్దవాడవగానే వాళ్లనీ వీళ్లనీ పోగుచేసి విజయవాడలో ఒక నాటకసమాజం స్థాపించాడు. అక్కడక్కడ ప్రదర్శనలివ్వటంజరిగింది. ఆర్థికంగా ఒకప్రదర్శనంకూడా ఎక్కిరాలేదు. దాదాపు ప్రతిసారీ హాలు అద్దెదగ్గరనుంచి అన్నీ చేతిదే పెట్టుకోవాలిసి వచ్చింది. ఏడాది తిరిగేసరికి తండ్రి ఇచ్చిన పొలం ఇల్లూ అన్నీ అమ్మగా వచ్చినడబ్బంతా ఈనాటకాలు దాదాపు మింగేశాయి. ఈ లెక్కన అయితే ఇంకా ఒకటి రెండు ప్రదర్శనాలకన్నా ఇచ్చే సత్తాలేదని తేలింది. ఆ రెండు కలిసి రాకపోతే చిప్ప చేతికి రావటం తప్పదు అనుకున్నాడు. ఇప్పుడు మానెయ్యటమా మరొక చాన్సు చూడటమా అని ఆలోచించాడు. మానేస్తే ఓటమిని అంగీకరించడమే! శతవిధాల అనుకున్నాదానికి మనస్సు అంగీకరించలేదు. ఆఖరి ప్రయత్నం చేస్తేనే మంచిదనిపించింది. అలాగే నిశ్చయించుకున్నాడు. అదీ కలిసి రాకపోతే ప్రక్కనే కృష్ణవేణమ్మ ఉన్నది. ఇపుడు ఓటమి అంగీకరించటంకంటె అదే మేలనిపించింది. ఈ నిశ్చయంతోపాటు ఒకరిద్దరు వేషాలు వేసేవారిని కూడా మార్చాలని తీర్మానించుకున్నాడు. ముఖ్యంగా స్త్రీ వేషం వేసే సరస్వతిని మార్చి ఇంకొకరిని పెట్టాలనుకున్నాడు. మొదటినుంచి ఆవిడలో భలానిదని చెప్పటానికి వీలులేకపోయినా ఏదో ఒక లోటున్నదని అనిపిస్తూనే ఉన్నది. అయితే సమాజం పెట్టినప్పటినుంచి, ఉన్నది కాబట్టి ఆవిడను మానుకోమని చెప్పడానికి మనస్కరించక ఇంతకాలమూ తోసుకురావడం జరిగింది. పైగా ఇంకొకరు వెంటనే దొరకటమూ కష్టమే. ఇపుడలా కాదు. ఇంకొకరు దొరికేమాట తరువాత చూచుకుందాం. ముందర ఆవిడను పంపించి తీరాలని నిర్ణయించుకొని పంపించేశాడు. ఇంకొక మనిషి దొరకడం ఆలస్యం కావచ్చు. అందు మూలాన ప్రదర్శనాలు అలస్యం కావచ్చు. ఎలాగైనా ఇది ఆఖరి ప్రయత్నం

---

* కామిలా ఆర్. బిట్లీ వ్రాసిన ‘హర్ లాస్ట్ పెరఫార్మెన్స్’ అన్న ఆంగ్లకథకు అనుసరణ.

గదా, కాస్త ఆలస్యమైనా ఫరవాలేదనుకున్నాడు పార్థసారథి.

సరస్వతిని పంపించివేసిన నాలుగురోజులకి మిత్రుడు దశరథరామయ్యవచ్చి గౌరీబాలనుగురించి చెప్పి ఆవిడను తీసుకోమని సిఫార్సు చేశాడు. గౌరీబాలకు డ్యాన్సు, పాట కొద్దిగా వచ్చనీ, ఊరు కాకినాడనీ, కొద్దిగా స్టేజి అనుభవం ఉన్నదనీ, చదువుకున్నదీ, తెలివిగలదనీ, శిక్షణఇస్తే పైకి రాగలదనీ దశరథ రామయ్య మరి మరీ చెప్పేసరికి సరేనన్నాడు.

గౌరీబాలకు ఎడతెరపిలేకుండా రెండు నెలలు శిక్షణ ఇచ్చాడు. రిహార్సల్సు చేయించాడు. మొదటి ప్రదర్శనం జనం బాగున్నదన్నారు. ఖర్చులుమాత్రం గిట్టినాయి. రెండో నాటకం బందరులో వేశారు. అక్కడ అనుకున్నదానికంటే ఎక్కువ కలెక్షన్సు వచ్చాయి. జనంలో పేరు బాగా పాకిపోయింది. అక్కడనుంచి పార్థసారథికి చక్రం తిరిగింది. ప్రతి ప్రదర్శనం హిట్ అయింది. రెండేళ్లపాటు విధివిరామంలేకుండా ఆంధ్రదేశమంతటా తిరిగి ప్రదర్శనలిచ్చారు. అయిదేళ్లక్రితం మద్రాసు వచ్చారు. అక్కడ కూడా ప్రదర్శనలు జయప్రదమైనాయి. కొందరు సినిమా నిర్మాతలు గౌరీబాలను ఆటకీ, పాటకీ బుక్ చేసుకున్నారు. దేశంలోనూ, మద్రాసులోనూ, ప్రదర్శనలిస్తూ, అక్కడే ఉండిపోయారు. మద్రాసుకు వచ్చేముందే ఇద్దరూ రిజిస్టరు వివాహం చేసుకున్నారు. వారి వృత్తి జీవనం మల్లేనే వారి దాంపత్యజీవితంకూడా చక్కగా ఉన్నది. తమ పని అన్నా, తామన్నా ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ఎక్కడలేని అభిమానము. మద్రాసు వచ్చిన ఏడాదికల్లా వారి కొక ఆడపిల్ల కలిగింది. ఆ అమ్మాయికి వసంత అని పేరుపెట్టారు.

2

గౌరీబాల అడయారులో తమ ఇంటినుంచి నుంగంబాకంలో ఉన్న డాక్టరు గణపతి క్లినిక్కు బయలుదేరింది. దారి పొడుగునా అనేక ఆలోచనలు పుట్టుకొచ్చాయి. డాక్టరు ఏమిచెబుతాడోనని భయం వేసింది. ఏమి చెబుతే ఏమని ధైర్యమూ తెచ్చుకుంది. గత ఏడుసంవత్సరాలు మహా ఆనందంగా, సుఖప్రదంగా గడిచిపోయాయి. తనకూ, తన భర్తకూ ఇద్దరికీ పేరు వచ్చింది. కుటుంబజీవితంలో ఏ లోటూ లోపంలేదు. వారిద్దరిమధ్య అభిప్రాయ భేదమనేది ఎపుడూ రాలేదు. ఇద్దరికీ అన్యోన్యత అనేది బాగా ఏర్పడింది. ఆర్థికంగా కూడా అన్నీ బాగానే ఉన్నాయి. అడయారులో ఉన్నది సొంత ఇల్లు. ఇదీ కాక ఇంకో ఇల్లున్నది. తనకి కావలసినన్ని నగలున్నాయి. బ్యాంకులో ఇద్దరి పేరా వేరు వేరుగా పెద్ద మొత్తాలున్నాయి. తను వేషం వేయకపోవటం మూలాన నాటక సమాజం ఎత్తివేయనక్కరలేదు. ఎత్తివేసినా తన భర్త సినీమారంగంలో ఏదోవిధంగా సంపాదించగలడు. తను మానేసినా ఇబ్బందిలేదు. భర్తని కూతుర్నీ చూచుకుంటూ సంతోషంగా, తృప్తిగా కాలం గడుపుకోవచ్చు. ఇలా అనుకుంటూ ఉండగానే డాక్టరు గణపతి క్లినిక్ వచ్చింది.

కారు దిగి లోపలికి వెళ్ళి కూర్చున్న అయిదు నిమిషాలకే డాక్టరు వచ్చి పరీక్ష గదిలోకి తీసుకుని వెళ్లాడు. కుర్చీలో కూర్చోబెట్టి గోడకు తగిలించిన అట్టలమీద రకరకాల అక్షరాలను చూడమన్నాడు. కనబడుతున్నాయా అన్నాడు. తరువాత తల వెనక్కువంచమని మందుబొట్లు కళ్లలో వేశాడు.

డాక్టరు పరీక్ష చాలాసేపు చేశాడు. టార్చిలైటు తీసికొని గ్రుడ్డుమీద ఫోకస్ చేశాడు. కళ్లరెప్పలను ఎత్తిపట్టుకుని క్రిందిరెప్పను క్రిందికిలాగి టార్చిలైటు వెలుగు అటూ ఇటూ ప్రసరింపచేస్తూ చూచాడు. ఒక కన్ను తరువాత రెండోకంటికీ అలాగే చేశాడు. ఇలా చేసిందే చేస్తుంటే గౌరీబాలకి కాస్త విసుగేసి ఇంకా ఎంతసేపు అనుకుంది. భోజనానికి టైము అవుతోంది... ఈ పరీక్ష ఎంతసేపటికీ తెమలటంలేదు. బజారుకువెళ్ళి ఇంకా రాలేదేమో అని ఆయన అనుకుంటూ ఉంటారు. అయినా ఎందుకో ఆలస్యమైందిలే అని అనుకుంటారు. పరవాలేదు. అయినా ఈ పరీక్ష ఎంతసేపటికి తెమలందే? కళ్ళజోడు వేసుకోవాలని చెప్పడానికి ఇంత ఆలస్యమూ, హంగామా ఎందుకు! తన రంగుకు, ముఖానికి తగిన కళ్ళజోడును కొనుక్కోవాలి. ఇపుడు అనేక రకాల కళ్ళజోళ్ళు వస్తున్నాయి. ఇలా తలుచుకుంటూ తన విసుగును కోపాన్ని తప్పించాలని చూసింది గౌరీబాల. కాని కుదురలేదు...

ఇహ పట్టలేకపోయింది.

“ఇంకా ఎంతసేపవుతుందండీ” అని అడిగింది.

“అబ్బే అయిపోవచ్చింది. అయిపోయింది” అని చెప్పి ఆమె వృత్తిని గురించి, ఆరోగ్యాన్ని గురించి,

భర్తని గురించి, కుటుంబాన్ని గురించి ఏవేవో ప్రశ్నలు వేశాడు. అన్నిటికి సమాధాన మిచ్చింది. ఇపుడేవస్తా నని ఆఫీసు గదిలోకి వెళ్లి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు.

"ఇంతగా ఇదివరకు ఎవరూ నన్ను పరీక్ష చేయ లేదండి" అన్నది గౌరీబాల. డాక్టరు కాస్త నవ్వాడు.

"మీ ఆయనకు టెలిఫోను చేశాను. మీ కంట్లో వేసిన చుక్కలగుణం ఇపుడపుడే తగ్గదు. మీరు ఒంట రిగా ఇంటికి వెళ్ళటం నా కిష్టంలేదు."

"నాకు గుడ్డితనం వచ్చిందనే!" చమత్కరించి నట్లు ప్రశ్నించింది గౌరీబాల. డాక్టరు ఒక క్షణం మాట్లాడలేదు. సిగరెట్టు ముట్టించి అన్నాడు. "దృష్టి అనేది పోతూన్నపుడు గాని దాని విలువ, అవసరం మనకు తెలియవు." ఈ మాటలు నెమ్మదిగా మామూలుగా అన్నాడు.

గౌరీబాల ఒక పెట్టున కుంగిపోయింది. తాను గుడ్డిది అయిపోతున్నట్లే గుండె గుభేలుమన్నది. అయితే తక్షణం వట్టిదనుకున్నది.

"నిజం, గ్రుడ్డితనంకంటె దురదృష్టం మరొకటి ఏముంటుందండీ" అన్నది.

"కాని అంతకన్న ఇంకా దురదృష్టమైనవి ఉన్నాయి. ఎందుకంటే మీ బిడ్డకే ఒకవేళ గ్రుడ్డితనం వచ్చినదనుకోండి, అది ఇంతకన్న పెద్ద దురదృష్టం కాదా ?"

వెంటనే గౌరీబాలకు వసంతరూపం కళ్ల ముందు మెరిసింది. వసంతకు ఇపుడిపుడే అదీ ఇదీ తెలుస్తోంది. దానికే గ్రుడ్డితనము వచ్చి అంతా అంధకార మయ మయితే, ఇక ఏమీ తెలియదన్నమాట. ఏమీ కనపడదన్నమాట. వళ్లు జలదరించిదది.

"అవును. అది ఇంకా పెద్ద అరిష్టమే." అన్నది. అలా అనటంలో తనకు గుడ్డితనంరావటం మేలని తనకు తెలియకుండానే అంగీకరించింది.

"మీ ఆయన వచ్చినట్లున్నారు" అని డాక్టరు ఆవిడను చేయి పుచ్చుకొని తన ఆఫీసు గదిలోకి తీసుకొని వెళ్లాడు. ఆగది పెద్ద వెలుతురులేకుండా మంచి బంగారువన్నె కర్టెనులతో ఉన్న సంగతి జ్ఞాపకము వచ్చింది. ఇపుడు అవేమీ కనుపడటంలేదు. అంతా మసకగా ఉంది. ఎదురుగుండాఉన్న రెండు కిటికీలు బయటి వెలుతురును తెలుపుతున్న రెండు రంధ్రాలు లాగా కనుపడుతున్నాయి.

"హలో పార్థసారథిగారా" అని పలకరించి "ఆవిడను చాలాసేపు కష్టపెట్టాను" అన్నాడు గణపతి.

గౌరీబాల భర్తను చూడలేదు. చూచేలోపలనే పార్థసారథి ఆవిడ చెయ్యిపట్టుకుని "ఏమిటిదంతా. నువ్వెపుడూ ఇలా ఉన్నదని నాకు చెప్పలేదే" అన్నాడు.

"ఎక్కువేంలేదు. మీరు గాబరాపడతారని చెప్పలేదు. దాన్ని గురించి అనుకోకుండాఉంటే మంచి దనుకున్నాను" అని సమాధాన మిచ్చింది గౌరీబాల.

"కూర్చోండి. మనం కొన్ని సంగతులు మాట్లాడాలి" అని డాక్టరు సూచించాడు.

పార్థసారథి, గౌరీబాల సోఫాలో కూర్చున్నారు. డాక్టరు కూర్చున్నది కిటికీముందు. అందుకని అతని వెన కాల వెలుతురు బాగాఉన్నది. అతను ఆమెకు ఒక నీడగా కనుపడుతున్నాడు. మాటనుబట్టి అతను దగ్గర గానే ఉన్నట్లు అనిపించింది. తాను దేన్ని గురించి భయపడిందో అతను దాన్ని గురించే చెబుతున్నాడు. డాక్టరు మాట్లాడిన ప్రతిమాట ఆమెలోకి గుండులాగా దూసుకొనిపోయి అక్కడే నిలిచిపోతున్నట్లున్నది. కాసేపు అయ్యేసరికి డాక్టరుమాటలు వినబడటం మానే శాయి. తాను గ్రుడ్డిదాన్ని అయిపోతానన్న ఆవేదనలో మునిగిపోయింది. మరి ఇతరజ్ఞానంలేదు.

పార్థసారథి ఆమె రెండు చేతులను తనచేతుల్లోకి తీసుకున్నాడు. గట్టిగా పట్టుకున్నాడు. ఆవత్తిడిని ఓర్చుకోలేక పోతున్నది. అతనిచేతులు తెలుపుతున్న ఆవేదన డాక్టరు మాటలు కలిగించినదానికంటె ఎక్కువగా ఉన్నది.

ఆవిడ అతనిమీద అనుకున్నంత దగ్గరకు జరిగింది. "మీరు విచారపడకండి. ఇప్పటికి ఇదీ నయమే. ఇంత కన్న పెద్ద అరిష్టము రాలేదు" అని సముదాయించింది భర్తని.

"అదేమిటి! ఇంతకన్నా ఇంకా దురదృష్టమేం ఉంది రావడానికి" అన్నాడు బాధతో పెగిలీ పెగలని కంఠంతో.

ఇంతలోకే డాక్టరు అందుకున్నాడు "జబ్బు ఇపుడే ఆరంభమైంది. ఇపుడు ఇదివరకు అనుకోని అసాధారణమైన ఆపరేషనులు అనేకం చేస్తున్నారు

మీ దృష్టి తగ్గుతోంది. కాని ఎంతకాలం ఇపుడున్నట్లుంటుందో చెప్పలేము. అదంతా మీ అదృష్టం. కొంత కాలం చీకటికి వెలుతురుకు భేదం తెలుస్తూ ఉండవచ్చు. దానికి అలవాటుపడి వెనుకటి మోస్తరుగానే ముందుకూడా మీ జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించవచ్చు."

"ముందు ఏమి చేయమన్నారు. ఇంకెవరిని చూడమన్నారు" అడిగాడు పార్థసారథి.

ఊళ్ళో ఉన్న డాక్టరు లందరినీ చూచారు. కలకత్తా, బొంబాయిలలో ఉన్న పెద్దడాక్టరు లందరినీ చూచారు. డాక్టరులచుట్టూ తిరగడంతోనే ఆరునెలలు గడిచిపోయాయి. దాంతో నాటకప్రదర్శనలు అంటూ లేకుండా పోయినాయి. అదివరకు ఏర్పాటు అయినవే విరమించుకోవటం జరిగింది. ఇపుడు వాటి తొందర లేదు.

ఏదో...ఒక డాక్టరు తన వ్యాధిని కుదర్చలేక పోతాడా అనుకుంది గౌరీబాల. కాని ఏ డాక్టరూ ఏమీ చేయలేకపోయాడు. ఆపరేషను అనేది వీలు లేదన్నారు. చూచిన ప్రతిడాక్టరూ చీకటిగదిలోకి తీసికెళ్లి పరీక్షచేసి లాభంలేదని అత్యంత సానుభూతితో నెమ్మదిగా చెప్పటం తప్ప ఏమీ చేయలేదు.

దాంతో గౌరీబాలకు నిరాశ జాస్తి అయిపోయింది. గ్రుడ్డితనం రాబోతూన్నదన్న భయంతో ఒక్కొక్కపుడు ఊపిరితీసికోనడం కూడా కష్టమైపోయేది. భయంతో కళ్లు అర్పుకుని గట్టిగా చుట్టూఉన్న వస్తువులను స్పష్టంగా చూడటానికి ప్రయత్నించేది. కాఫీ తాగేటప్పుడు కప్పును తిసుకొని దానిలో ఉన్న కాఫీని, దాని ఆవిరిని, కప్పు అంచుకు ఉండే బంగారు రంగు పట్టీని చూడటానికి కళ్లు విప్పి విప్పి చూచేది. కానీ ఏమీ కనుపడేది కాదు.

ఇక లాభంలేదు అనుకుంది. అయితే ఉన్న ఇతర ఇంద్రియాలకు కొత్త శక్తులు ఉత్పన్న మవుతున్నట్టు అనిపించింది. వాసన, స్పర్శ అనేవి మునుపటికన్న బాగా తెలుస్తున్నాయి. వాటివల్ల కొస్త ధైర్యం వచ్చింది. కాని ఇవన్నీ దృష్టిలోపాన్ని తీసివేయలేవు. కాఫీకప్పు కప్పుగా కనపడటంలేదు. ఏదో ఒక గుండ్రని ముద్దగా కనుపడుతోంది. ఆ ముద్దని తనపెదిమలకు అందివ్వాలి.

"ఈ డాక్టర్ల చుట్టూ తిరిగి లాభంలేదు. ఇంట్లో ఉండటమే మంచిది. ఇంకా ఆశలు పెట్టుకొని లాభంలేదు. తోసుకువచ్చేదాన్ని ఎదుర్కొనక తప్పదు" అన్నది గౌరీబాల.

3

ఇలా అన్నది కాని లోపల ఆమె దిగులుతో నలిగిపోతున్నది. కుమిలిపోతున్నది. కుమిలి కుమిలి కొన్నాళ్లకు కొస్త కుదుటబడి 'దృష్టిలేకపోయినా మిగతా వన్నీ ఉన్నాయి. ఏలోటూ లేదు. స్త్రీకి కావలసినవన్నీ ఉన్నాయి' అని అనుకున్నది. అయితే అనుకోటం వేరు. నమ్మటంవేరు. తన జీవితాన్ని యథాతథంగా అంగీకరించగల మనస్థితి ఎప్పటికైనా వస్తుందా అనుకుంది.

ఒకరోజున ఎక్కడలేని భయమువేసింది. ఆ భయంతో ఊపిరి ఆగిపోతుందా అనిపించింది. దగ్గరున్న కూతుర్ని ఒళ్ళోకిలాక్కొని ఆ అమ్మాయి మొహంలో తన ముఖంపెట్టి చూచింది. కూతురికళ్ళలో నీలాలు కనుపడతాయి అనుకుంది. బుగ్గలమీద చిన్నగుంటలు కనుబడుతా యనుకుంది.

"అమ్మా నీ ముక్కులో గాలి నా నోట్లోకి వస్తోంది." అన్నది వసంత. గౌరీబాల నవ్వింది. నా ముక్కు అంత దగ్గరగా ఉన్నదా తల్లీ."

"నీకళ్ల నలుపులో నా ముఖం కనుపడుతున్నది" అన్నది వసంత.

"బాగుంది నాకళ్ళు నీ ఫోటోను తీస్తున్నాయి."

"కళ్లు ఫోటోతీసే కెమెరాలు కాదమ్మా"అన్నది వసంత. లీలగా ఛాయగా కనుపడుతున్న పిల్ల అదృశ్యమైపోయింది. గదిలో తిరుగుతున్నట్లు మాత్రం తెలుస్తున్నది. వసంత కిటికీ దగ్గర ఉండి బొమ్మతో ఏదో మాట్లాడుతోంది. తరువాత చప్పుడు చేస్తూ పళ్లరసం త్రాగుతానంటూ వంటావిడ దగ్గరకు వెళ్లింది.

గౌరీబాల పెద్ద నిట్టూర్పు విడిచింది. తనుచదువగలిగితే ఎంత బాగుండు ననుకుంది. గ్రుడ్డివాళ్ళు నేర్చుకొనే లిపి తనూ నేర్చుకొని ఆ పుస్తకాలు చదువవచ్చు ననుకున్నది. తన ప్రపంచమంతా సంధ్యాకాంతిగా ఉన్నా తనకు తాను చదువుకుంటూ ఉండవచ్చు ననుకున్నది. ఈ సంగతి పార్థసారథికి చెప్పింది. కాని అతను ఏమీ మాట్లాడలేదు. ఆమె దృష్టి ప్రసక్తి వస్తే మాట తప్పిస్తాడు. ఆమె దృష్టి పోతుందని అనుకుంటే ఓటమిని అంగీకరించినట్లే అనుకుంటాడు. గౌరీబాలకు ఈ జబ్బు వచ్చినదన్న మాటనే బయటికి రానీయలేదు. వారు ఆ యా పట్టణాలకు ఎందుకు వెళ్ళుతున్నదీ ఎవ

రికీ తెలియదు. ఆమె వేషాలు వేయడం ఎందుకు మాని వేసింది కూడా చెప్పలేదు. పార్థసారధికి తను వేషాలు వేయటం మానివేయటం ఇష్టం లేదని గ్రహించింది. ఒకరోజు ఇద్దరూ ఆ విషయంలో హోరాహోరిగా వాదించుకున్నారు.

4

ఒకనాడు సాయంకాలము ఫలహారం వేళ జరిగింది. తను, భర్తా కాఫీ త్రాగటానికి కూర్చు న్నారు. ప్లేటులో వేసిన టిఫిను తీసికొని తిన్నది. కాని కెటిల్ లోంచి కాఫీపోసుకోటం కష్టమైపో యింది. అపుడే వసంత నీళ్ళుపోసుకొని సబ్బు వాస నతో తల్లి దగ్గరకువచ్చింది. తల్లి ముద్దు పెట్టుకున్నది. పిల్లతల తడిగావున్నట్లు అనిపించింది. "అమ్మాయి తల గట్టిగా తుడిచి కాస్త ఆరబెట్టు" అని పనిమనిషి సుబ్బమ్మను పిలిచి చెప్పింది.

పార్థసారధి అందిచ్చిన కాఫీ తీసుకున్నది. కుర్చీలో చేరగిలపడి తను చాలా అదృష్టవంతురాల ననుకున్నది. పార్థసారధిలాంటి భర్త, వసంతలాంటి పిల్ల, సుబ్బమ్మలాంటి పనిమనిషి, తమఇల్లు ఇవన్నీ చూస్తే తనకు ఏమిలోటు అని అనుకున్నది.

"నేను ఇహ వృత్తి మానివేస్తాను. స్టేజిమీదకు రాలేను.మనం కలిసి 7 సంవత్సరములు అయింది. లెక్క- వేస్తే ఆ ఏడేళ్ళలో మూడుసంవత్సరాల కాలమైనా నేను స్టేజిమీద గడిపివుంటాను. ప్రతిరాత్రి 8 గంటలు నిద్రపోతే రెండేళ్ళు నిద్రలో గడిపివుంటాను. ఇక పోతే మీతోనూ వసంతతోను అచ్చంగా గడిపింది రెండు సంవత్సరాలుమాత్రమే అయిఉంటుంది. ఇహ తల్లిగా వేరేప్రసక్తిలేకుండా పూర్తిగా భార్యగా జీవిత శేషాన్ని గడపటం మంచిది" అన్నది గౌరీబాల.

"నీవు వేషాలువేయటం విరమించుకోటం అనేది లేదు. నీవులేకుండా ఈప్రదర్శనను ఇవ్వదలచుకో లేదు" అన్నాడు పార్థసారధి.

"నాతో ఎలా జరుగుతుంది. నాకు దృష్టిపోయిం దని అందరికీ ఎందుకు చెప్పకూడదు? నాకు గుడ్డితనం వస్తే అది నాతప్పు కాదుకదా!" ఒకవిధమైన ఆవేశం తోనూ, ఆవేదనతోనూ ప్రశ్నించింది గౌరీబాల.

"నీకు గ్రుడ్డితనంలేదు. లేనప్పుడు నీవెందుకు మానెయ్యాలో నాకర్థంకావటంలేదు. కావలిస్తే నీవు అందరికీ చెప్పు. కాని అసలు ఇప్పుడెందుకు చెప్పాలి! అవసరమేముంది."

"నే నెలా నటిస్తాను! ఎలా డ్యాన్సుచేస్తాను! స్టేజిమీద తడుముకుంటూ, పడుతూ లేస్తూ తిరగ మంటారా? ఇంటిపట్టున అంటిపెట్టు కుండటమే నాకు సమ్మతం. స్టేజిమీద కనపడటమే నాజీవితం కాదు కదా? కాదు. నిజంగా కాదు."

"నువ్వేమీ పడవు. సెట్సుని జ్ఞాపకం ఉంచు కుంటే సరి. ఉన్నదల్లా మొత్తం మూడుసెట్సు. వెలుగు అనేది కనపడుతున్నంతమటుకు ఏమీ ఫరవాలేదు."

"నా కిష్టంలేదు."

"అలా వీల్లేదు. వేసితీరవలసిందే" అని పార్థ సారధి గట్టిగా చెప్పాడు. అతనిధోరణిచూస్తే ఇదిగో ఈమాత్ర వేసుకుంటే నయమవుతుందని చెప్పి నట్లుంది. ఆవిడకోసమే అతను పట్టుపట్టుతున్నట్లు కనుబడుతోంది. కాని స్టేజిమీదకు ఎలా వెడతాం అన్నదే గౌరీబాల ఆలోచన, సమస్య.

"నేను మానేస్తా నంటంలేదు. ఇంటినీ బిడ్డనీ కని పెట్టుకొని ఉండాలని ఉన్నది. అందుకే దేవుడు నాకు దృష్టిలేకుండా చేస్తున్నాడేమో అని అనిపిస్తోంది."

"అలాంటివిచారం అనవసరం. ఇల్లాలుగా నీలో ఏ లోటూ లేదు. ఇంటిని చూడటంలో అంత కంటే లేదు. ఇంట్లో కూరుకుపోటానికి వాటికి సంబంధం లేదు."

ఇలాఅని పార్థసారధి కిటికీ దగ్గిరికి వెళ్లాడు. కారునలుపు అద్దము మీద వెలుతురు పడితే ఎలా కను బడుతుందో అలా కనుబడింది కిటికీ దగ్గర పార్థసారధి ఆకారము.

"ఇదిగో చూడండీ. నేను మానేస్తున్నాను అని అనడం ఎందుకు? నిజాన్ని తెలుసుకుంటున్నామను కోండి. నేనెప్పుడు మానెయ్యవచ్చునో చెప్పండి:" అని అడిగింది.

ఛాయగా ఉన్న పార్థసారధి దగ్గరకు వచ్చాడు. "సగం గ్రుడ్డితనం వచ్చినా స్టేజిమీదకు వచ్చి మామూ లుగా నటించగలవని రుజువు చేసిననాడు నీవు మానుకో వచ్చు" అన్నాడు. ఈ మాటలు అతనిలోంచి పగలు తీసికొనివచ్చినట్లు అనిపించాయి. "నేను చెబుతున్నా విను. నేను సమాజంపెట్టి ప్రదర్శనలు ఇవ్వటం మొదలు పెట్టినపుడు ఒక్కటీ ఎక్కరాలేదు. వేసిన నాటకాలు ఒకటి తరువాత ఒకటి దెబ్బతింటూ వచ్చాయి. అయినా నేను ఊరుకోలేదు. ధైర్యం పోలేదు. ఆస్తి అమ్మి డబ్బుపెడుతూనే వచ్చాను.

చివరికి దివాలాతీసే స్థితిలోకి వచ్చాను. అపుడు నువ్వు వచ్చావు. మన సమాజం దశ తిరిగింది. నువ్వు అధైర్య పడనవసరంలేదు. ఇపుడొకసారి ఈ స్థితిలో స్టేజిమీదకి వచ్చావా తరువాత అదే అలవాటయిపోతుంది."

"అవునవును. మీరు చెప్పే సిద్ధాంతం తరతరాలుగా అందరూ చెపుతూ ఉన్నదే. ఈ తడవ వేషం వేస్తాను. తరువాత మళ్లీ వేయమంటే వేయను. ముందు నాటికి ఇంతకంటే గ్రుడ్డితనం వస్తుంది. ఆ ముందు సంవత్సరానికి ఇంకా ఎక్కువవుతుంది. మీగు మాత్రం పరవాలేదు. నీవు వేషం వెయ్యవచ్చు, ఆడవచ్చు, పాడవచ్చు నంటూనే ఉంటారు. నువ్వు గ్రుడ్డిదానివి అయి విరమించుకున్నావని ఎవరు అనకూడదంటారు. నిజమేనా?"

"చాల్లే నీ మాటలు" అంటూ పార్థసారధి గౌరీబాలను ఒడిలోకి తీసుకున్నాడు. ఆవిడ పెదవులను ముద్దుతో మూసివేశాడు. ఆతని కౌగిలిలో అన్నీ మరచిపోయింది. భయమనేది పోయింది. అంతా ఆనందమయంగా కనుపడింది.

గౌరీబాల ఒక నిట్టూర్పు విడిచింది. "సరే ఈ సారికి వేషం వేస్తాను. ఈ వేషాలు వేస్తూ ఉండటమే నాకు జీవితలక్ష్యంకాదు. చదవటం నేర్చుకుంటాను. వసంత దగ్గరే అహర్నిశలు ఉంటూ ఉంటాను. మరో బిడ్డను కూడా కంటాను. పిల్లో పిల్లాడో నాకు ఇంకొకరు కావాలి. గుడ్డివాళ్లుకూడా పిల్లల్ని కనవచ్చుకదా?"

రిహార్సలుకు వెళ్ళినపుడు కొంతమందికి చెప్పక తప్పిందికాదు. సుబ్బమ్మకు అదివరకే తెలుసు. అందుకనే అదివరకు ఏ సామానులు ఏ వస్తువులు ఎక్కడెక్కడ ఉన్నాయో అన్నీ అక్కడే ఉంచింది. గౌరీబాల ప్రతిచోటికివెళ్ళి అన్నిటినీ ముట్టుకొని చూచింది. సుబ్బమ్మ లేకపోతే గౌరీబాలకు కష్టమయ్యేది.

రిహార్సల్సుకూడా నాటకం వేసినట్లే వేయిడానికి నిర్ణయించుకున్నారు. గ్రీనురూములో కూడా ఏర్పాటులన్నీ పూర్వంలాగానే చేశారు. అక్కడ తనకు అదీ ఇదీ అందిచ్చి అన్ని పనులుచేసే రత్తమ్మ అంతా ఊహించుకున్నది. వేషాలువేసే మిగతా వారికి కూడా తెలిసింది. వారందరు ఆమె విచారపడ్డంతగానూ విచారపడ్డారు. ఎవరికీ చెప్పకూడదనుకున్నారు. రహస్యాన్ని జాగ్రత్తగా కాపాడారు.

రిహార్సల్సు స్టేజిమీద ప్రారంభించారు. మొదట్లో కొస్త ఆ బల్లమీద, ఆ కుర్చీమీద పడటం జరిగింది. తరువాత అన్నీ అలవాటు అయిపోయినాయి. అందరూ వెళ్ళిన తరువాత ఆవిడా పార్థసారథీ స్టేజినుంచి లోపలికి, లోపలినుంచి స్టేజిమీదికిరావటం అభ్యాసం చేశారు. ఏ సీనులో ఎట్లా తిరగాలో అట్లా స్టేజిమీదంతటా తిరిగారు. సాయంకాలం ఇంట్లో కళ్ళకు కట్టినట్లు అంతా పార్థసారధి నూరిపోసేవాడు. అందువల్ల అంతా సులువుగానే కనపడింది.

పాత్ర సంభాషణలు కూడా పార్థసారధి చదివి వినిపించి, అనిపించి, వల్లెవేయించాడు. ఆమె వాటిని అప్పచెబుతూ అంటుంటే ఎక్కడాకూడా ఒక పొరపాటు రాలేదు.

అమాంతంగా ఆవిడకు ఎక్కడలేని ఆనందమూ కలిగింది. ఈ నాటకము ఏలాగైనా వేయటం అవసరం అనుపించింది. అది జయప్రదంగావేసి అందరి మెప్పు పొంది తన కీర్తిగంటలు మ్రోగుతుండగా విరమించటం బాగుంటుంది. అందుకనే భర్త అంత పట్టుబట్టాడు ఈ నాటకం ఎలాగైనా వేసితీరాలని. తను వేషం వెయ్యాలనుకుంటే ఇంకా వేసి ఉండేదాన్నే నన్నధీమాతో జీవితశేషమంతా అనుకుంటూ ఉండవచ్చు.

నాటకము వెయ్యటానికి ఇంకా రెండు వారాలే వ్యవధి ఉన్నది. అంతవరదాకా ముద్దలు ముద్దలుగా కనపడే నలుపూ తెలుపూ ఒకే పొగలాగా కనపడటం మొదలుపెట్టాయి. నీడనీడలుగా ఇపుడు కనుబడటం అనేది లేదు. దగ్గరకు వెళ్ళి చూస్తే అదివరకు వస్తువులు లీలగా ఏవో అంచులల్లే కనుపడుతున్నాయి. మొదట మనస్సు బెదిరింది. కాని ఇదంతా తను భయపడి ఊహించుకుంటున్నాననుకుంది. అంతవరకు రావటానికి ఇంకాచాలాకాలం పడుతుంది అనుకుంది. వ్యవధికోసం భగవంతుణ్ణి ప్రార్థించింది.

ఒకరోజు ఉదయం లేచేసరికి కడుపులో ఏదో ఆవేదన పుట్టుకొచ్చింది. పక్కలో అటూ ఇటూ దొర్లి ఎదురుగుండా ఉన్న కిటికీలోకి చూచింది. కిటికీకి అవతల బాల్కనీలో ఉన్న అరటి ఆకులాంటి ఆకులున్న క్రోటను మొక్క అదివరదాకా నీడగా కనుపడేది. ఇపుడూ అది అక్కడే ఉన్నది. ఉన్నదని ఆమెకు తెలుసు. ఆ క్రిందటి రోజున సుబ్బమ్మను అడిగితే అది అక్కడనే ఉన్నదని చెప్పింది కూడాను. కాని ఈ ఉదయము అది కనుబడలేదు. కిటికీమాత్రం పొగరంగు తెలుపులో ఒక చట్రంలాగా కనపడుతున్నది. గది మిగతాభాగ మంతా ఒక విధమైన అంధకారంతో నిండిపోయింది.

నెమ్మదిగా లేచి బాత్ రూములోకి వెళ్లింది. అలవాటు చొప్పున టూత్ బ్రష్ ఉన్నచోటునుంచి

తడుముకోకుండానే తీసుకున్నది. అలమార తెరచి పేస్టు తీసుకొన్నది. తరువాత హెయిర్ బ్రష్ తీసుకున్నది. ఇవన్నీ చేసుకుంటూనే ఉన్నా ఒక ప్రక్కనిమాత్రం భయం తొలుస్తూనే ఉన్నది. దాన్ని విడిపించుకోటానికి పెనుగులాడుతున్నది. క్రింది పెదిమను గట్టిగా కరచుకొన్నది. ఏమైనాసరే ఈ నాటకం అయ్యేవరకు ఈ మార్పును భర్తకు చెప్పకూడదనుకున్నది. ఇది “నాకు పరీక్ష” అనుకున్నది.

భోజనంచేసే గదిలోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నది. కిటికీలోంచి నీరెండ ఆమె భుజంమీద పడి మెరిసింది. “ఇవ్వాళ పెసరట్లు మంచి వాసన వేస్తున్నాయి. చాలారోజులైంది తిని. ఇదిగో మీరు పేపరు చదవటం మానేయండి. చాలా మంచివారుగాని కాస్త కాఫీ ఇలా పొయ్యండి” అని భర్తతో సల్లాప ధోరణిలో అన్నది. అంతా మామూలుగానే ఉన్నట్లు అనిపించింది. చెవులు, ముక్కు అలాగే చెబుతున్నాయి. కాని భోజనాలగది అంతా ఒకే నల్లని పొగరంగులో ఉన్నది.

“అమ్మాయి ఏదీ?” అని అడిగింది.

“నువ్వు లేచిరావటం ఆలస్యమైంది. నేను అది ఇందాకే తినేశాము. ఇవాళ సిద్ధమవటానికి ఇంత ఆలస్యమైందే?” అడిగాడు పార్థసారథి.

“ఏమీలేదు, వట్టి బద్ధకంతప్ప” అని సమాధానమిచ్చింది. కాని అంతరంగంలో భయపడింది. తను మామూలుగా రాలేకపోతున్నానా అని. ఏదీ చేసుకోలేనేమో? రాలేనేమో? భగవంతుడా అనుకొని ఆయనకు ఇపుడపుడే చెప్పకూడదని మళ్ళీ నిర్ణయం చేసుకొన్నది.

“నీవు క్రిందటి తడవ కళ్ళు పరీక్ష చేసికొని ఎన్నాళ్ళయింది?” అని అడిగాడు పార్థసారథి.

“అట్టే రోజులు కాలేదు!”

“ఎన్నిరోజులైందంటే?”

“పదిహేను రోజులైంది.”

“ఇవాళ్ళో రేపో ఇంకొకసారి చూపించుకుంటే నయం.”

“ఎందుకు? అనవసరం.”

“అనవసరం అంటావేమిటి. పదిరోజులకో పదిహేను రోజులకో ఒకతడవ చూపించుకోటం మంచిదనుకున్నాంగా! ఈమధ్య ఏమైనా మార్పువచ్చినట్లు అనిపించిందా?”

“లేదు.”

“డాక్టరుకు ఫోనుచేసి ఎప్పుడు రమ్మంటాడో అడుగుతాను. నేనూవస్తాను.”

“అక్కర్లేదు! మీరెందుకు. నేను ఒక్కర్తెనూ వెళ్ళగలను.”

“వెళ్ళాలనే, వెళ్ళగలవనే నేను చెప్పేది. నీ కలాంటిశక్తి ఉన్నది” అన్నాడు ఉత్సాహంగా.

అతనిమాట నిజంకావాలనుకున్నది. మనో నిశ్చయమేకనుక సరిపోతే తను ఎప్పుడూ నిస్సహాయత అనుభవించనక్కరలేదు. డాక్టరునూ చూడనవసరంలేదు. ఇప్పుడూ అనవసరం. నాటకం వేయటానికి ఇంకా పంరోజులుంది. తన్నేదీ ఆపలేదు, ఏదీ అడ్డలేదు. ఏమైనా ఆ నాటకంలో వేషం వేసి తీరాలిసిందే. తన కిదొక అగ్నిపరీక్షలాంటిది. ఆనాటకం వేస్తేనేగాని తనకూ మనశ్శాంతి ఉండదు. ఆయనకూ మనశ్శాంతి ఉండదు. కాబట్టి నాటకంలో వేసితీరాలిసిందే” అని అనుకున్నది.

తరువాత వారంరోజులు గడవటం యమయాతన అయింది. అపుడపుడు తనదృష్టి కాస్త నయమన్నట్లు అనిపించేది. ముఖ్యంగా స్టేజిమీద రిహార్సలు చేసేటప్పుడు ఒక్కొక్కసమయంలో కాస్త ఎక్కువగా అనిపించేది. దీపాలు బాగాఉన్నప్పుడు తోటి యాక్టరు తనదగ్గరకు వస్తూంటే ఛాయగా కనుపడేవాడు.

ఈ చిన్న చిన్న మార్పులే, మహత్తరమైనవిగా కనుపడేవి. రాత్రిపడుకుంటూ రేపు ఇంతకన్న బాగా ఉంటుంది. నే నింతత్వరగా ఎందుకూ పనికిరాకుండా పోను అని అనుకునేది. ఒకప్పుడు దృష్టి కాస్తబాగానే ఉన్నట్లుండేది. అయితే అది కొద్దిక్షణాలపాటు మాత్రం. కాని ఆశకలిగించటానికి చాలు.

5

ఆరాత్రి నాటకప్రదర్శనానికి భార్యాభర్తలిద్దరు కారులో బయలుదేరారు. భర్తకి దగ్గరగా అనుకొని కూర్చున్నది. పార్థసారథి ఆవిడ నడుంపైన తన చేయివేసి దగ్గరకు తీసుకున్నాడు.

“ఎలావుంది?” అడిగాడు.

“బాగానే ఉంది.”

"నేను ఆసాంతము దగ్గరలోనే పక్కనే ఉంటాను. భయపడకు."

"అవును. నాకు భయమెందుకు?" ఇలా అన్నదే కాని నాటకశాలవద్ద కారుదిగి లోపలికి వెళ్లటం ఎలాగు అని ఆలోచిస్తూనే ఉన్నది. ఇంటిదగ్గర కారులో ఎక్కేటప్పుడు తడుముకోవలసి వచ్చినది. ఇప్పుడు దిగేటప్పుడు ఎలా ఉంటుందో అని ఆందోళన పడుతున్నది. ఏమీ లాభంలేదు. అంతా అంధకారమయంగా వుంది. ఇంటికి పోదామని చెప్పాలనుకుంది. అయితే అలా ఉన్నదని నమ్మటానికి తనకే ఇష్టం లేకపోయింది. ఇంకా కనపడటం అనేది పోలేదు. చూడగలను అని తమాయించుకుంది. కారు ఆగేసరికి సంధ్యవెలుగులా కాస్త కనపడింది. అది నాటకశాల దీపాలకాంతి అయిఉండవచ్చు. ఆ కాంతి ఆమెలో అంతర్గతంగా ఉన్న ఆశారేఖ కావచ్చు. కాని దాంతో ఆమెకు ఆత్మవిశ్వాసం ఏర్పడింది. ధైర్యం వచ్చింది.

రత్తమ్మ వచ్చి ఆవిడను గ్రీనురూములోకి తీసుకొని వెళ్లింది. బట్టలు మార్చి వేషధారణ చెయ్యటానికి రత్తమ్మ సహాయపడింది. ఆమె చేతులు తగిలితే హాయిగా ఉన్నది. ఆవిడ చేతులు తొందరలేకుండా తొట్రుపాటులేకుండా బలంగా చురుగ్గా పనిచేస్తున్నాయి. చప్పున రత్తమ్మ చేయితీసి కొన్నది. తన చెంపకు హత్తుకుంది.

"రత్నం! అంతా సరిగా జరిగిపోవాలనికోరుకో."

"ఇంకా ఎక్కువైనట్లున్నదే."? అంది రత్తమ్మ జాలిగా.

"అవును."

"అయితే వారికి చెబితే మంచిదేమో?"

"వద్దు. ఇపుడే వద్దు." అని ఆతురతతో కూడిన తీవ్రతతో అన్నది. స్టేజిమీదికి వెళ్లబోయే ముందు వెనుక ఎక్కడో విన్నది జ్ఞాపకము వచ్చింది. కొత్తగా పుట్టిన పిల్లనైనా సరే నీళ్లలో పడవేస్తే ఈదటానికి ప్రయత్నిస్తుంది. అది తలుచుకుని ధైర్యం తెచ్చుకుంది. స్టేజిమీదికి వెళ్ళింది. సరిగా నాలుగు అడుగులువేసి స్టేజిమీదకి వెళ్లవలసిన చోటికి వెళ్లేసరికి ఆసీనులో బల్లమీద పువ్వులు అమర్చిఉంటాయి అని తెలుసు. వాటి వాసన తెలిసింది. అక్కడ నుంచుని తన ముఖం కుడివైపుకు భుజంమీదుగా తిప్పితే పురుషవేషం వేసిన అతని రాక అలికిడి వినబడుతుంది. అలాగే వినబడింది. అలా అతనూ వచ్చాడు. కొత్తగా పుట్టిన పిల్ల ఈదగలిగితే దీంట్లోంచి నేనెందుకు బయటపడలేననుకుంది. ఇలా అనుకున్న మరుక్షణంలోనే పాత్రాభినయానికి ఉపక్రమించింది. దాంతో తనను తాను మరచిపోయింది. పాత్రలో కలిసిపోయింది. పాట అభినయం ఆమెను తరంగాలమీద తేలించి ఆకాశానికి ఎత్తుకుపోతున్నట్లు అనిపించింది. ఆనాడు ఆమె గొంతు ఒక మహాతంత్రి మ్రోగినట్లుగా ఉన్నది. గొంతు ఎప్పుడూ పలకనట్లు పలుకుతోంది. ప్రేక్షకులు మోళీకట్టినట్లుగా ప్రతిమలలా కదలక మెదలక కూర్చుండిపోయారు. హాలంతా మహా నిశ్శబ్దంగా ఉన్నది.

ఆమె పాత్రాభినయం అయిపోయింది. నెమ్మదిగా సైడు కర్టెనులవైపు తిరిగింది. పది అడుగులు వేస్తే లోపలికి వెళ్ళవచ్చని కాళ్ళకి చెప్పింది. పది అడుగులు వేసే సరికి సరిగా రత్తమ్మ చేయిపట్టుకొని తీసుకొని వెళ్ళింది.

రంగంమీదనుంచి వెళుతుంటే పెద్దపెట్టున చప్పట్లు హర్షధ్వానాలు చెలరేగాయి. అవి సముద్రఘోషలాగా తుపానుమోతలాగా వెనుకఉన్న గ్రీసు రూములోకి వెళ్ళేదాకా వినబడుతూనే ఉన్నాయి.

అక్కడికివెళ్లిన కాసేపటికి వణుకుపుట్టింది. తను భయపడుతున్న అంధకారం ఆవరించింది. నల్లచీకటితప్ప ఇంకేమీ కనబడటంలేదు. భర్తను పిలిచింది. రాని స్వరంతో నెమ్మదిగా పిలిచింది. చేతులు చాచింది. చూపులేనివాడు తడుముకుంటున్నట్లు ఎదట తడిమి చూచింది. అది ఏమిచేయలేనిస్థితిలో చేసేపని. ఇవ్వాళ్ల దీన్ని ఎదిరించి ప్రతిఘటించింది.

రత్తమ్మవచ్చి పట్టుకుంది. "ఆయన ఇక్కడికి ఇంకా రాలేదమ్మా" అన్నది.

"నువ్వుచూచావా రత్తమ్మా? ఎలాపాడానంటావు? ఎలా అభినయించానంటావు? మామూలుగా చేశానా? వాళ్లందరికి తెలిసిందంటావా?"

"ఇంతబాగా ఇదివరకెపుడు చేయలేదమ్మా. నిజం! ఎపుడూ ఇంతబాగాలేను. చెబితేనమ్మ."

బైట మనుష్యులు తోసుకొస్తున్న చప్పుడు వినబడింది. పార్థసారథి తలుపుతోసుకొని అమాంతం

లోపలికివచ్చాడు. ఆమెను.చప్పున కౌగలించుకున్నాడు. ఆమె తనతలను అతని హృదయంమీద ఆనించింది. కౌగలివదలి ఆమె రెండుభుజాలు పట్టుకొని ముఖంలోకి చూస్తూ "బయట జనం పొంగిపోతున్నారు నిన్ను చూడాలని. వారినిరానిస్తే ఈగది బద్దలై పోతుంది.ఒకర్ని మాత్రం రానిచ్చాను. ఆయన విజయవాడలో ఉన్నపుడు మన ఇంటిడాక్టరు రామారావుగారు. తన అభినందనలు తెలియజేయటానికి వచ్చాడు." అన్నాడు.

"చాలా థ్యాంక్సు డాక్టరుగారూ" అని డాక్టరుతో అన్నది...

డాక్టరు ఆమెనుచూస్తూ కొన్నిక్షణాలపాటు అలా నిలబడిపోయాడు.

"మీరు నాతో ఎందుకు చెప్పలేదు" అన్నాడు పార్ధసారధివంక చూచి.

"ఏమి చెప్పలేదంటారు?" అడిగాడు పార్ధసారధి.

"మీభార్య గ్రు—" వాక్యాన్ని పూర్తిచేయకనే చటుక్కున ఆగాడు. కాని గౌరీబాలకు "గ్రుడ్డిద" నే వినబడింది.

గుడ్డి! గుడ్డి! గుడ్డి! ఈమాటతో చెవులు గింగురెత్తిపోతున్నాయి. సంవత్సరం దాదాపు ఆమాటను తలచుకుంటూకుంగిపోయింది. ఆమాటభయంతో నే జీవించింది. కాని ఇప్పుడు అది ఒకమాటమాత్రమే అని అనిపించింది. అంతేతేలింది. ఆ అంధకారం తనని కబళించలేక పోయింది. తాను ఎప్పటి గౌరీబాల లాగానే ఉన్నది. తనలోనిజీవశక్తి యధాప్రకారంగానేఉన్నది. జనం కూడా ఇదివరకటి గౌరీబాలే అనుకున్నారు.

తను ఏదో వింత అనుభూతిని పొందుతోంది. ఆ అనుభూతితో తనశరీరం గగుర్పొడిచింది. తను గగనమార్గానికి తారాజువ్వలాగాఎగిరి అక్కడపగిలి పువ్వులై ప్రసరించినట్లనిపించింది. ఒక నూతన ప్రపంచంలో ప్రవేశించబోతున్నట్లున్నది. స్పర్శసౌఖ్యం, శబ్దమాధుర్యం, వాసనానుభూతి, ప్రకాశించటానికి స్టేజిమీద వెనకఉండే నల్ల తెరలాంటిది మాత్రమే అక్కడి అంధకారం. అక్కడ సత్యం, ప్రేమ అనే దీపాలకాంతిని ఆచ్ఛాదించటానికి వీలులేదు. ఆ ప్రపంచంలో తనకు ఒంటరితనము అనేదిలేదు. తనభర్త ఉన్నాడు.

ఇంటికివచ్చారు. పార్ధసారధి ఇంటితలుపు తెరిచి అమెను పదమన్నాడు. భయపడవద్దన్నాడు. గడప దాటి గౌరిబాల చేతులుచాచింది. అతను అక్కడ ఉన్నాడు. అతను తనచేతులకి హృదయానికి కనుబడుతున్నాడు. అవి అతన్ని చూస్తున్నాయి. దగ్గరకు తీసికొని ఆవిడ హృదయంమీద తన తలపెట్టి గట్టిగా కౌగలించుకున్నాడు పార్ధసారధి. ఒక మాటకూడా మాట్లాడలేదు. ఆ మౌనమే అంతా చెబుతోంది. ఆ క్షణంలో భవిష్యత్తు స్పష్టంగా జాజ్వల్యమానంగా సాక్షాత్కరించింది. అది ఒక మహోత్కృష్టమైన సందర్శనం!